# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 30-01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మాతా శిశు సంరక్షణ భవనాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.**
2. **పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలపై ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.**
3. **పర్యాటక అభివృద్ధితో రాష్ట్రానికి ఆదాయంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందని అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**
4. **రాష్ట్రంలో కోకో పంటను సాగుచేస్తున్న రైతులకు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.**

**5. ఖేలో ఇండియా ద్వారా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సహకారం అందించాలని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

----------------------

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మాతా శిశు సంరక్షణ భవనాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్లతో పాటు జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ…

..వాయిస్.. 22 సెకన్లు

ఈ మధ్యాహ్నం చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని గుడుపల్లె మండలంలో కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం.. ముఖ్యమంత్రి కుప్పం పురపాలక సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన పర్యాటక శాఖ పున్నమి హోటల్ ను పునఃప్రారంభిస్తారు. అలాగే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

----------------------

ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ విశాఖపట్నం పర్యటన రెండవ రోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి అభివృద్ధి శాఖల అధికారులతో ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ మౌలికసదుపాయాల కల్పన, స్వచ్ఛమైన మంచినీటి సరఫరా, స్థానిక స్వపరిపాలన బలోపేతంపై చర్చించారు. అనంతరం కాలుష్యనియంత్రణ మండలి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

----------------------

పర్యాటక అభివృద్ధితో రాష్ట్రానికి ఆదాయంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందని అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అనకాపల్లి జిల్లా కొండకర్ల లోవలో అనకాపల్లి ఉత్సవాన్ని రాష్ట్ర శాసన సభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడితో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ..

..వాయిస్.. 25 సెకన్లు

----------------------

ఖేలో ఇండియా ద్వారా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సహకారం అందించాలని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీవాస్తవతో మంత్రి ఈ రోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహిళా క్రీడల ప్రోత్సాహానికి 'అస్మిత' పథకం అమలు, ఫిట్‌నెస్, కోచ్‌ల సంఖ్య పెంపు, క్రీడా బడ్జెట్ పెంపుపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న క్రీడా పోటీల గురించి వివరించారు. ప్రతి జిల్లాలో మహిళల అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు

----------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాధ్ లు ఈరోజు వేర్వేరుగా దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల మంత్రి టిజి భరత్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18నెలల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ ఐదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

----------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో హర్యానా రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులు ఉన్నాయి. జాతీయ రాజధాని ప్రాంతం -NCRకు ఆనుకుని ఉండటం, ఉత్తర, పడమర రాష్ట్రాలకి ముఖ ద్వారంగా ఉంటూ, ప్రధాన రహదారులు, రైల్వే, లాజిస్టిక్స్ మార్గాలు హర్యానా మీదుగా వెళ్లడంతో ఈ రాష్ట్రం దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తోంది. ప్రస్తుతం హర్యానాలో 6.38 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో పలు ప్రధాన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి.ఈ ప్రాజెక్టుల అమలులో భూసేకరణ, విద్యుత్, అంతర్రాష్ట్ర సమన్వయం, పర్యావరణ అనుమతులు వంటి సమస్యలు ఎదురవడంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రగతి యంత్రాంగం కింద సమీక్ష నిర్వహించారు. దీంతో 112 ప్రాజెక్టుల్లో 57 ప్రాజెక్టులు పూర్తవ్వగా, మిగిలిన 55 ప్రాజెక్టులు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. ప్రగతి పర్యవేక్షణ కింద హర్యానాలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, రాష్ట్రాన్ని మాత్రమే కాకుండా దేశాన్ని ముందుకు నడిపించే చోదక శక్తిగా మారింది.

----------------------

రాష్ట్రంలో కోకో పంటను సాగుచేస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. ఏలూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి "కోకో కాంక్లేవ్-2026." కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోకో ఉత్పతులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో సాగు చేస్తున్నారని తెలిపారు. కోకో గింజలకు కూడా అంతర్జాతీయ మార్కెట్ లో సరైన ధర లభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

----------------------

ప్రకాశం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా కల్పనా కుమారి ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని చెప్పారు. స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ తెలియజేస్తూ

వాయిస్ .. 22 సెకన్లు

-----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకూ.. 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు" -స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత వాతావరణంపై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పారిశుధ్య నిర్వహణ, శ్రమదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

-----------------------

కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక వెసులుబాటు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి. భాస్కర్ రావు కోరారు. విజయవాడలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, పరిశ్రమలు, పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయిస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని చెప్పారు. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన రంగాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి అవసరమైన ప్రోత్సాహకాలను బడ్జెట్‌లో ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

-----------------------

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్‌లో " బీటింగ్ ద రిట్రీట్ " కార్యక్రమాన్ని  నిన్న నిర్వహించారు. ఇందులో భాగంగా  'వందే మాతర గీతం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని  ప్రత్యేక దేశభక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశభక్తి, జాతీయ ఐక్యతను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ సంగీత ప్రదర్శన..  స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు, రైల్వే సిబ్బందిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ADRM PE. ఎడ్విన్, ఆపరేషన్స్ ADRM  శ్రీనివాసరావులతో పాటు పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

-----------------------

రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ 2027పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లకు స్పష్టం చేశారు. రానున్న 2027 జనాభా లెక్కల సేకరణపై అమరావతి సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు

= = = = = = = = = = = = = = = = = = = = = = =